మొండి శవం?

వాణిశ్రీ

ముసురుపట్టి మూడురోజులయింది.

ఎక్కడో సముద్రంలో వాయుగుండం పడి దాని ప్రభావం యిక్కడ ముసురు రూపంలో చూపిస్తున్నది.

రంగడికి ఒకటే చిరాకుగా వుంది.

రోజూ గుట్టలమీద స్వేచ్ఛగా తిరిగే ప్రాణం వాడిది. చేతులు ముడుచుకుని యింట్లో కూర్చునేసరికి ఏమీ తోచక గిలగిల కొట్టుకున్నాడు.

నాలుగోరోజు కొంచెం తెరపిచ్చింది. అయినా మబ్బులు క్రమ్ముకునే వున్నాయి. వర్షం రాదని గ్యారంటీ లేదు.

"పశువుల్ని గుట్టలకెళ్లి తోలుకెల్తా!" అన్నాడు రంగడు యజమానితో.

"వాన వచ్చేటట్లుంది" అన్నాడు రామిరెడ్డి.

"రాదయ్యా!" అన్నాడు రంగడు.

"వద్దులే. అవి వానలో తడిస్తే లేనిపోని రోగాలు

వస్తాయి" అన్నాడు.

"పోనీ పచ్చగడ్డి కోసుకొస్తా" అంటూ యజమాని అనుమతి కోసం యెదురు చూడకుండానే వెళ్ళిపోయాడు రంగడు.

గోకుడుపార భుజాన పెట్టుకుని హుషారుగా బయలుదేరాడు రంగడు.

చల్లగా హాయిగా వుంది వాతావరణం.

ఆనందంగా తలలూపుతున్నాయి చింతల తోపులో చెట్లు.

కారు మేఘాలు హడావుడిగా పరుగులు తీస్తున్నాయి ఆకాశంలో.

ఊరుచివర గుట్టల దగ్గర వెళ్ళి గడ్డి దట్టంగా పెరిగిన చోట చూసి కూర్చుని గోకుడుపారతో గడ్డి కోస్తున్నాడు. కోస్తూ కోస్తూ ముందుకెళ్ళి యెందుకో తల పైకెత్తి చూశాడు.

అంతే. వాడి గుండె ఆగిపోయినట్లయింది. ముచ్చెమటలు పోసుకొచ్చాయి. భయంతో వొళ్ళు చల్లబడిపోయింది.

భూమిలో నుంచి పుట్టుకొచ్చిన మనిషి చెయ్యి స్పష్టంగా కనిపించింది. ఐదు వ్రేళ్ళతో సహా అరఅడుగు పైకిలేచి అప్పుడే మొలకెత్తిన మొక్కలా వుంది.

రంగడు అటూ ఇటూ చూశాడు. కనుచూపు మేరలో నరసంచారం కనిపించలేదు.

కోసినగడ్డి, గోకుడుపార అక్కడే వదిలి వెనక్కి చూడకుండా పరిగెత్తాడు. ఊరు చేరేవరకూ యెక్కడా ఆగలేదు. ఆ హస్తం తనని తరుముతుందేమోనని వాడికి భయం పట్టుకుంది.

చెమట్లు కక్కుతూ, ఆయాసపడుతూ వచ్చి నిల్చున్న రంగడిని చూసి యేం జరిగిందోనని హడిలిపోయాడు రామిరెడ్డి.

"ఏరా యేం జరిగిందిరా?" అని ప్రశ్నించాడు కంగారుగా.

"భూమిలోంచి చెయ్యి పుట్టుకొచ్చింది" భయంతో కళ్ళు అప్పుతూ చెప్పాడు రంగడు.

"ఏమిట్రా....మళ్ళీ చెప్పు" అన్నాడు రామిరెడ్డి నివ్వెర పోతూ.

రంగడు చెప్పాడు.

"భూమిలోంచి చెయ్యి పుట్టడం ఏమిట్రా. నీ బొంద లాగా వుంది. ఎవరన్నా వింటే నవ్వుతారు" అన్నాడు రామిరెడ్డి.

"ఒట్టు అయ్యగారూ! కళ్ళారా చూశాను. అది మనిషి చెయ్యే. నాకు భయంపుట్టి పారిపోయి వచ్చాను" అన్నాడు రంగడు తన తలమీద చేయి పెట్టుకుని.

రామిరెడ్డి ఆలోచనలో పడిపోయాడు.

రంగడు చూసింది నిజమేనా?

నిజమే అనుకోవాల్సి వస్తోంది. వాడికి అబద్ధం చెప్పా ల్సిన పని ఏముంది?

అయినా యిదేం విచిత్రం?

ఏమిటో వెళ్ళి చూస్తేగాని తెలియదు అనుకున్నాడు.

ఎందుకైనా మంచిదని మునసబు నాయుడు యింటికి వెళ్ళి చెప్పాడు.

అంతా విని ఆశ్చర్యపోయాడు మునసబు నాయుడు.

"వెళ్ళిచూస్తే తెలిసిపోతుంది గదా!" అన్నాడు రామిరెడ్డి.

"ఉండవోయ్ రెడ్డీ. నీకంతా తొందరే. కాస్త గుర్రాన్ని కట్టేయ్. మనం వూరికే వూగులాడుకుంటూ వెళ్తే లాభంలేదు. పోలీసుల్ని తీసుకుని వెళ్ళాలి" అన్నాడు నాయుడు.

రామిరెడ్డి ఆశ్చర్యానికి అంతులేదు. భూమిలోంచి హస్తం పుట్టుకురావడం ఒక వింతగా తను అనుకుంటుంటే పోలీసుల్ని తీసుకెళ్ళాలంటా డేమిటి నాయుడు? అనుకొన్నాడు.

"పోలీసులు ఎందుకు?" అన్నాడు.

"ఎందుకంటే ఎవడో, ఎవడ్నో ఖూనీచేసి అక్కడ పాతిపెట్టాడు గనుక" అన్నాడు నాయుడు.

"ఖూనీయే!...." అన్నాడు రామిరెడ్డి కళ్ళు పెద్దవి జేసి.

"మరి లేకపోతే భూమిలోంచి హస్తం ఎట్లా పుట్టుకొస్తుందోయ్ పిచ్చిమారాజా! ఇదేం పురాణకాలం అనుకున్నావా వింతలు విడ్డూరాలు జరగడానికి" అన్నాడు నవ్వుతూ.

"ఈ చుట్టుప్రక్కల వూళ్ళలో యెక్కడా ఖూనీలు జరిగినట్లు లేదే! అయినా ఎలక్షన్ టైము గూడా కాదు గదా! ఖూనీ యెందుకు జరిగిందబ్బా!" అన్నాడు రామిరెడ్డి బుర్ర గోక్కుంటూ.

"ఖూనీ జరగడానికి ఒక టైము కావాలా?" అన్నాడు.

"అయితే మనం అక్కడికి వద్దంటావా నాయుడూ!" అన్నాడు రామిరెడ్డి.

"మన కెందుకొచ్చిన పీడా! పోలీసులకి రిపోర్టు చేస్తే ఆ తిప్పలేవో వాళ్ళే పడతారు" అన్నాడు నాయుడు.

తర్వాత తెల్లకాగితం తీసుకుని ప్రక్కవూరు గరుడ పల్లిలో వున్న పోలీస్ స్టేషన్‌కి రిపోర్టు రాసి పంపించాడు నాయుడు.

మధ్యాహ్నానికి పోలీస్ జీపు వూళ్ళోకి వచ్చింది. మున సబు నాయుడి యింటిదగ్గర ఆగింది.

జీపు రాక విని రామిరెడ్డి, నాయుడు ఇంటికి వెళ్ళాడు హడావుడిగా.

ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, హెడ్‌కానిస్టేబుల్ కాక నలుగురు కానిస్టేబుల్సు కూడా వున్నారు అక్కడ.

రామిరెడ్డిని చూసి "రావోయ్ రెడ్డీ. నీ గురించే కబురు పెట్టాలనుకుంటున్నాను. ఆ రంగడిని పిలిపించు" అన్నాడు.

కాసేపటికి రంగడిని వెంటపెట్టుకొని వచ్చాడు రామి రెడ్డి.

అంతా కలసి జీప్‌లో గుట్టల దగ్గరకి వెళ్ళారు.

హస్తం కనిపించింది.

ఎస్.ఐ. కృష్ణమూర్తి జాగ్రత్తగా పరిశీలించి చూసి "మనిషిని పూడ్చిపెట్టారు పైపైన. ఈ వానలకి వుబ్బి చెయ్యి బైటకు వచ్చింది" అన్నాడు.

"నేను అనుకుంటూనే వున్నాను...." అన్నాడు నాయుడు.

"ఇది స్మశానం కాదుగదా....!" అన్నాడు కృష్ణ మూర్తి.

"అబ్బే. అసలు మనుషులు తిరిగే ప్రదేశమే కాదు ఇది. కుర్రాళ్ళు గొడ్లు కాయడానికి వస్తారు ఇక్కడికి. మైలు దూరంలో వూరికి దగ్గర్లోనే వుంది స్మశానం" అన్నాడు నాయుడు.

"సరే! త్రవ్వించండి" అన్నా ఎస్.ఐ.

వెట్టిమనిషి గునపం తీసుకుని త్రవ్వసాగాడు. కష్టం లేకుండానే బైటపడింది శవం.

కాని ఆ శవానికి తలలేదు.

అంతా ఆశ్చర్యంతో స్థాణువులై పోయారు ఆ శవాన్ని చూస్తూ.

బట్టలు ఏ రంగువో తెలియనంత మట్టికొట్టుకుపోయి వున్నాయి. తొడుక్కున్నట్టి ప్యాంటు, షర్టునిబట్టి శవం మగవాడిదని తెలుసుకున్నారు.

శవాన్ని పంచనామా చేసి పోస్టుమార్టమ్ చెయ్యడానికి పంపించారు.

"చుట్టుప్రక్కల అన్ని వూళ్ళలోనూ చాటింపు వేయించండి. ఎవరైనా రావడానికి అవకాశం వుంటుంది గదా" అన్నాడు ఎస్.ఐ.

"అలాగే చేస్తాను సార్!" అన్నాడు నాయుడు.

అందరి దగ్గరా సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు ఎస్.ఐ. కృష్ణమూర్తి.

2

ఆ చుట్టుప్రక్కల అన్ని వూళ్ళలోనూ చాటింపు వేశారు మొండిశవం గురించి.

గరుడపల్లి సబ్ ఇనస్పెక్టర్ కృష్ణమూర్తి పంపిన రిపోర్టు ఆధారంగా పత్రికల వారికి వివరాలు విడుదల చేశాడు సూపర్నెంటు ఆఫ్ పోలీసు.

పోస్టుమార్టమ్ రిపోర్టు వచ్చింది.

సెప్టెంబర్ పదకొండో తేది రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో అతని ప్రాణం పోయింది.

ఆహారం తీసుకోవడానికి ముందు అతను బ్రాందీ త్రాగి వున్నాడు.

ఇక అతని వయస్సు ముప్ఫై సంవత్సరాలుంటాయి.

ఈ వివరాలన్నీ ప్రముఖ దినపత్రిక లన్నింటిలోనూ ప్రకటించారు. కొన్ని పత్రికల్లో అతని తలలేని శవాన్ని ఫోటోతీసి అచ్చువేశారు.

అతని బంధువులు ఎవరైనా వుంటే సూపరెన్టెంట్ ని కలుసుకోమని గూడా ప్రకటించారు.

వారం రోజుల వరకూ ఎవరూ రాలేదు.

శవం యెవరిదో గుర్తుపట్టే ఆధారం యేమీ దొరక లేదు.

శవానికి తలలేదు.

శవం తొడుక్కున్న బట్టలమీద చాకలి గుర్తులు ఏవీ లేవు.

జేబుల్లో కాగితాలు యేమీలేవు.

కుడిచేతిమీద రెండు పుట్టుమచ్చలుమాత్రం వున్నాయి.

వారంరోజులు గడిచేసరికి ఇక యెవరూ రారులే అను కున్నాడు ఎస్.ఐ. కృష్ణమూర్తి.

ఇక ఆ కేసు గురించి యేమీ ఆధారం దొరకదు అని నిరాశపడ్డాడు గూడా.

కాని ఆ రోజు మధ్యాహ్నం మూడుగంటల ప్రాంతంలో పాతిక సంవత్సరాలు వయసున్న యువతి గరుడపల్లి పోలీస్ స్టేషన్ లో అడుగుపెట్టింది.

ఆమెవంక ప్రశ్నార్థకంగా చూశాడు కృష్ణమూర్తి.

"అదేసార్! గాజులపల్లిలో తలలేని శవంకేసు. అతను ఈమె భర్తట" అన్నాడు హెడ్ కానిస్టేబుల్.

"అలాగా! కూర్చోండి" అన్నాడు కృష్ణమూర్తి తన సీటు ఎదురుగావున్న కుర్చీ చూపించి.

ఆమె కూర్చోవడానికి తటపటాయిస్తూ "ఫరవాలేదు సార్!" అంది.

"కూర్చోండి...." అన్నాడు హెడ్ కానిస్టేబుల్.

ఆమె ఇబ్బందిగా కూర్చుంది కుర్చీలో.

కృష్ణమూర్తి ఆమెను పరిశీలనగా చూశాడు.

ఆమెకు పాతిక సంవత్సరాలకి లోపే వుంటాయి. ఐదడుగుల పైనే ఎత్తుంది. శరీరపు రంగు నలుపే అయినా ముఖం కళగావుంది. సన్నగా వుందిగాని కష్టజీవి కాదు. ఆమె చీరకట్టుకున్న పద్ధతి చూస్తే నాగరికంగానే వుంది. చెవులకు దుద్దులున్నాయి. అవి బంగారపువే. మెడలో పసుపుతాడు తప్ప ఇక ఏ ఆభరణాలూ లేవు.

ఆమె విచారంగా వుంది.

"అతడు మీకు యేమవుతాడు?" అన్నాడు కృష్ణమూర్తి.

"మా ఆయన."

"పేరు?"

"జగన్నాథం.

"ఏ వూరు మీది?"

"ఏలూరు."

"చాల దూరం వుందే. జగన్నాథం ఇక్కడికి ఎందుకు వచ్చివుంటాడు?"

"అదే నాకూ తెలియడంలేదు సార్!" విచారంగా అంది ఆమె.

"మీ పేరు?"

"సీతమ్మ."

"చూడండి సీతమ్మగారూ! నేను అడిగిన వాటికి సరిగ్గా జవాబులు చెప్తే హంతకులను పట్టుకోవడానికి వీలుంటుంది" అన్నాడు కృష్ణమూర్తి.

"అడగండి సార్!" యేడుపు ఆపుకుంటూ అంది సీతమ్మ.

"మీ భర్త యేదైనా ఉద్యోగం చేస్తుంటాడా?"

"అవును సార్. గవర్నమెంటు ఆఫీసులో ప్యూను ఉద్యోగం సార్."

"అతనికి విరోధులు ఎవరైనా వున్నారా?"

సీతమ్మ క్షణం ఆలోచించి "మా వీధిలో యెవరూ లేరుసార్. ఆఫీసులో యెవరైనా వున్నారేమో తెలియదు సార్" అంది.

"మీది ఏలూరు స్వంత గ్రామమా?"

"కాదు సార్."

"ఏ వూరు?"

"మాది కడప సార్."

"ఇద్దరిదీ కడప కాదుగదా!"

"కాదు. అతనిది అనంతపురం."

"మీకు పెళ్ళయి ఎంతకాలమైంది."

"నాలుగు సంవత్సరాలు."

"అంతేనా?"

"అవును."

"ఏ వూళ్ళో పెళ్ళయింది?"

ఆమె తటపటాయించింది.

"నాంగార్జునసాగర్‌లో."

"అక్కడ యెవరున్నారు....? మీ తల్లిదండ్రులున్నారా?...."

"లేదు సార్. మా అమ్మ కడపనుంచి సాగర్ వచ్చింది. సాగర్‌లో మా బంధువులు చాలమందివున్నారు. పనికోసం మా అమ్మ వచ్చింది."

"మీ నాన్న."

"చనిపోయాడు."

"ఏ ఆధారం లేక మీ అమ్మ నాగార్జునసాగర్ వచ్చిందన్నమాట పనికోసం?" అన్నాడు.

"అవును సార్."

"ఏదైనా పని దొరికిందా?"

"అప్పటికే అక్కడ డామ్ పని పూర్తయింది. ఏదో కూలి పని చేసుకుంటూ వున్నాం. అక్కడ వున్నప్పుడే నాకు పెళ్ళయింది. ఏడాది క్రితం ఆయనకి ఏలూరు ట్రాన్స్‌ఫరయింది. ఇప్పుడు అక్కడే వుంటున్నాం." అంది సీతమ్మ.

కృష్ణమూర్తి ఏదో ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు. ఏలూరు గరుడపల్లికి రెండువందల కిలోమీటర్లపైనే దూరం ఉంది. అందులోనూ ఇది హైవేలో లేదు. చాలా కార్నర్ విలేజ్. జగన్నాథం ఇక్కడికి ఎందుకు వచ్చి ఉంటాడు.

"అయితే ఇక్కడికి జగన్నాథం యెందుకు వచ్చి వుంటాడో మీకు తెలియదన్నమాట" అన్నాడు కృష్ణమూర్తి.

సీతమ్మ తల అడ్డంగా వూపింది.

"ఈ చుట్టుప్రక్కల వూళ్ళలో మీకు బంధువులు ఎవరైనా వున్నారా?"

"లేరు."

"పోనీ అతనికి స్నేహితులు యెవరైనా వున్నారా?"

"నాకు తెలియదు-సార్."

"మీ భర్త యెప్పటినుంచీ కనిపించటంలేదు?"

"ఈనెల నాలుగో తారీఖున యింటికి రాలేదు. రాత్రి చాలసేపు యెదురుచూశాను. ఇంకా వస్తాడు, ఇంకా వస్తాడని చూస్తే రాలేదు. పోనీ మర్నాడన్నా వస్తాడని చూశాను. రాలేదు. వాళ్ళ ఆఫీసుకి వెళ్ళి అడిగాను. రాలేదన్నారు."

"సెలవు పెట్టాడా?"

"లేదు."

"సెలవు పెట్టకుండా వెళ్ళిపోయే అలవాటు వుందా?"

"లేదు. ఎక్కడికీ వెళ్ళడు. అలాంటివాడు వున్నట్లుండి మాయమైపోయాడు."

"ఆ తర్వాత అతనికోసం మీరేవన్నా ప్రయత్నాలు చేశారా? నాగార్జున సాగర్లో మీ అమ్మకు తెలియజేశారా?"

"మా అమ్మ చచ్చిపోయింది. అక్కడ దూరపుబంధువులేగాని కావాల్సిన వాళ్ళు యెవరూ లేరు. మా ఆయన అక్కడికి వెళ్ళడు" దృఢంగా అంది ఆమె.

"పోనీ మీ భర్తకు బంధువులు యెవరూ లేరా?"

"ఒక అన్న వుండేవాడని చెపుతూ వుండేవాడు. కాని నేనెప్పుడూ చూడలేదు."

"ఏ వూళ్ళో?"

"హిందూపూరులో."

"ఒకవేళ వాళ్ళ అన్న ఇంటికి వెళ్ళాడేమో కదా!"

"వెళ్ళదల్చుకుంటే నాతో చెప్పి వెళ్ళేవాడు గదా. చెప్పకుండా ఎందుకు వెళ్ళాడు?"

కృష్ణమూర్తి ఏమీ మాట్లాడలేదు.

"ఈశవం జగన్నాథానిదే అనడానికి ఆధారం ఏదైనా వుందా?"

ఆమె అర్థంకానట్టు చూసింది.

"అతను మీకు కనిపించకుండా పోయేముందు ఏ రకం బట్టలు తొడుక్కొని వున్నాడు?"

"తెల్లవి."

కృష్ణమూర్తి తల వూపాడు.

"అతను యెంతో దూరంనుంచి యిక్కడికి ఎందుకు వచ్చివుంటాడో వూహించగలరా?" అన్నాడు కృష్ణమూర్తి.

సీతమ్మ ఆలోచనలో పడిపోయింది.

కాసేపయిన తర్వాత "మా ఆయనకి పేకాట పిచ్చి వుంది. ఆ ఆట ఆడడంకోసం యెంతదూరమైనా వెళ్తారు. ఒకవేళ పేకాట స్నేహితులెవరైనా ఆయన్ని యింత దూరం తీసుకొచ్చారేమో! అంటే ఈ చుట్టు ప్రక్కవాళ్లలో ఆయనకి ఆఫీసులో స్నేహితులు వుండివుండవచ్చు. ఆ ఆటలో ఆయన డబ్బు గెల్చుకుంటే తగాదా పడి చంపేసి వుండవచ్చుగదా!" అంది.

కృష్ణమూర్తి ఆమె చెప్పింది వూహించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఇంతలో ఫోన్ మ్రోగింది.

రిసీవర్ ఎత్తి "ఎస్.ఐ. కృష్ణమూర్తి స్పీకింగ్" అన్నాడు.

"..............."

"గుడ్ మార్నింగ్ సార్!"

"..............."

"ఐ.సీ.....వండ్రఫుల్ సార్! నా దగ్గరికి ఇప్పుడే ఒకమ్మాయి వచ్చింది సార్! ఆ శవం తన భర్తదని చెపుతూవుంది."

"..............."

"యస్. సార్!"

"..............."

"ఎస్. సార్."

"..............."

"ఇప్పుడే వస్తున్నా సార్!"

"..............."

"ఓ. కే. సార్."

కృష్ణమూర్తి రిసీవర్ క్రెడిల్ మీద పెట్టి సీతమ్మ చెప్పిందంతా రికార్డు చేశాడు.

"అమ్మా! మీరు చెప్పినట్లు జరగడానికి గూడా అవకాశం వుంది. పేకాట పిచ్చి చాలా దారుణమైన పిచ్చి. పేకాట స్నేహితుడితో పాటు మీ భర్త ఈ చుట్టుప్రక్కల వూరికి వచ్చివుండొచ్చు. ఏదైనా పెళ్ళికి తన స్నేహితుడి బలవంతం మీద వెళ్ళివుండొచ్చు" అన్నాడు.

"అదే సార్ నా అనుమానం" అంది సీతమ్మ.

"నేను ఎలాగైనా హంతకుల్ని పట్టుకుంటాను. మీరు దిగులుపడకండి" అని కాలింగ్ బెల్ నొక్కాడు.

సెంట్రీ లోపలకు వచ్చాడు.

"హెడ్ వెంకటస్వామిని పిలువు" అన్నాడు.

కాసేపటికి హెడ్ వెంకటస్వామి ప్రవేశించాడు.

అతన్ని చూస్తూనే "నువ్వు వెంటనే గాజులపల్లి వెళ్ళాలి" అన్నాడు.

"యస్ సార్" అన్నాడు హెడ్.

"మువసబు నాయుడుగారిని కలుసుకుని ఈ నెలలో ఆ చుట్టుప్రక్కల వూళ్ళలో ఎవరెవరి ఇళ్ళల్లో పెళ్ళిళ్ళు జరిగాయో! పెళ్ళిళ్ళు కాకపోయినా ఏదైనా శుభ కార్యాలు జరిగితే అవిగూడా! తెలుసుకుని రా. ఎంత రాత్రయినా తిరిగిరావాలి."

"యస్సార్!"

"నేను ఇప్పుడే గజపురం వెళ్తున్నాను. సి.ఐ.గారు రమ్మని ఫోన్ చేశారు" అన్నాడు కృష్ణమూర్తి కుర్చీలోంచి లేస్తూ.

"మీరు మీ అడ్రసు, మీ ఆయన పనిచేసిన ఆఫీసు అడ్రసు రాసివ్వండి" అన్నాడు తెల్లకాగితం ఆమెకు అందిస్తూ.

సీతమ్మ రాసి కృష్ణమూర్తి చేతికి అందించింది.

"మీరు వెళ్ళిపోండి. కేసు ఇన్వెస్టిగేషన్‌లో వుంది. టైం పడుతుంది ఫయినల్ కావడానికి" అన్నాడు.

మబ్బులేని వానలాగ ఆమె వున్నట్లుండి బావురుమని ఏడ్చింది. చేతులు జోడించి నమస్కారం చేస్తూ "సార్! నాకెవరూ దిక్కులేరు. మీరే దిక్కు" అంది.

కృష్ణమూర్తికి జాలి కలిగింది ఆమెను చూస్తుంటే.

"ఏడవకమ్మా! కొద్దో గొప్పో చదువుకున్న దానివి. ధైర్యంగా వుండాలి" అన్నాడు.

"సార్! మీరు దయుంచి నాకు ఆధారం చూపించాలి."

"నేనేం చెయ్యగలనమ్మా! నేరస్థులను పట్టుకోవడం నా పని" అన్నాడు.

"అది కాదు సార్! ఆయన చనిపోయినట్లు కాగితం ఇస్తే మీకు రుణపడివుంటాను సార్!" అంది.

"తప్పకుండా ఇస్తాం. కాని కొంత టైం పడుతుంది."

"అది ఇస్తే నాకు ఆయన ఆఫీసు నుంచి డబ్బు వస్తుంది. గవర్న్మెంటులో యేదైనా చిన్న వుద్యోగం దొరుకుతుంది సార్! దిక్కులేనిదాన్ని. లేకపోతే చచ్చిపోతాను సార్!" అంది సీతమ్మ.

"అలాగే. కాగితం ఇస్తాం—శవం మీ ఆయనే అని రుజువు కావాలి. నీకేం భయంలేదు. వెళ్ళిరా!" అన్నాడు బైటకి నడుస్తూ.

కృష్ణమూర్తి జీప్ ఎక్కి కూర్చున్నాక, అది స్టార్టయ్యే వరకూ ఆమె యేడుస్తూనే తనగోడు చెప్పుకుంటూ వుంది.

3

గరుడపల్లికి గజపురం ఇరవై మైళ్ళుంది. గజపురం తాలూకా కేంద్రం. అక్కడ సర్కిల్ ఇన్స్పెక్టర్ వున్నాడు.

కృష్ణమూర్తి అరగంట తర్వాత సి.ఐ. విశ్వనాథం ముందు కూర్చుని మాట్లాడుతున్నాడు.

"చెప్పండి సార్! ఆ శవం తన తమ్ముడిదే అని వచ్చినాయన ఎవరు?" అని ప్రశ్నించాడు కృష్ణమూర్తి.

"ఆయనొక పెద్ద రాజకీయవేత్త. ఈ తాలూకా మొత్తంలో పలుకుబడి కలవాడు. పేరు లింగయ్య."

"లింగయ్య నాకు తెలుసులెండి. ఇప్పటికి పదిపార్టీలు మారివుంటాడు నాకు తెలిసినంతవరకూ" అంటూ నవ్వాడు కృష్ణమూర్తి.

"పోయిన ఎలక్షన్స్‌లో ఎమ్.ఎల్.ఏ. పోటీచేసి ఓడి

పోయాడు."

"నాకు తెలుసు సార్!"

"కందిపాలెం పంచాయితీ బోర్డు ప్రెసిడెంట్ ప్రస్తుతం."

"ఇంతకీ యేమని రిపోర్టిచ్చాడు?"

"తన తమ్ముడు జానయ్య ఈ నెల తొమ్మిదో తారీఖు నుంచి కన్పించడంలేదు. రాజకీయ ప్రత్యర్థులు హత్యచేసి వుండవచ్చునని అనుమానిస్తున్నాను అంటూ ఇచ్చాడు."

"చంపాడు పాండి" అన్నాడు కృష్ణమూర్తి.

"ఏలూరు నుంచి వచ్చినావిడ ఎవరు?" అన్నాడు సి. ఐ.

"సీతమ్మ."

"ఇప్పుడు ఈ ఇద్దర్లో శవం ఎవరిదో మనం ఇన్వెస్టిగేట్ చెయ్యాలి."

"తప్పేది ఏవుంది?" అన్నాడు కృష్ణమూర్తి.

"అంగులో పొలిటికల్ మాన్ లింగయ్య. తలతిక్క మనిషి గూడ. తిక్క రేగిందంటే పోలీసులు అవతల పార్టీ కుక్కలు అని పేపరు స్టేట్‌మెంట్ ఇస్తాడు గూడా!" అన్నాడు సి.ఐ. నవ్వుతూ.

"అదే బాపతుమనిషి" తల వూపుతూ అన్నాడు కృష్ణమూర్తి.

"ఈ లింగయ్య రంగంలోకి దిగడంతో మనకి పెద్ద తలనొప్పి తగిలింది."

"లింగయ్య తమ్ముడికి ఎన్నేళ్ళుంటాలు?"

"ముప్పై వుంటాయని చెప్తున్నాడు."

"అవతల పార్టీవాళ్ళు అంటే పేర్లు రాసిచ్చాడా?"

"లేదు. టూకీగా అవతల పార్టీ వాళ్ళమీద అనుమానంగా వుంది" అన్నాడు.

"బాగుంది వరస" అన్నాడు కృష్ణమూర్తి నవ్వుతూ.

"ఏ హత్య జరిగినా, దొంగతనం జరిగినా దాన్ని రాజకీయాలకి ముడివెయ్యడం వాళ్ళ జన్మహక్కు" అన్నాడు సి. ఐ.

"మనం ఒకసారి లింగయ్యగారి వూరెళ్ళి పరిస్థితులు గమనించాలి.ఆయనగారి తమ్ముడి క్యారెక్టర్ ఎటువంటిదో? అసలు అతను ఏం పని చేస్తుంటాడో?"

"పనీపాటా లేదు. పంచాయితీలో మెంబరు. పార్టీలో ప్రముఖ కార్యకర్త."

"పార్టీల్లో విభేదాలవల్ల హత్య జరిగిందంటే నమ్మబుద్ధి పుట్టడంలేదు. ఎందుకంటే రాజకీయాలలో ఎవరూ యెవరికీ శాశ్వతంగా శత్రువులు కాదు, అలాగని మిత్రులూ కాదు. బద్ధశత్రువులు సైతం అర్ధరాత్రి పార్టీలు మార్చేస్తారు. చూస్తున్నారుగా రాజకీయాలు."

"అవుననుకో. హత్యకు కారణం వెతకాలి గదా!"

"కారణం యేముంటుంది సార్. ఏ మురుడ దగ్గర తగాదావల్లగాని, ఏ కాలువగట్టు గొడవల్లోగాని హత్య జరగవచ్చు. దాన్ని మసిపూసి మారేడుకాయ చేస్తారు పొలిటికల్ వాళ్ళు" అన్నాడు కృష్ణమూర్తి.

"ఏది యేమైనా ఇన్వెస్టిగేషన్ చెయ్యాలి గదా!"

కృష్ణమూర్తి తల వ్రాపాడు.

"సార్! హెడ్‌క్వార్టర్స్ నుంచి వైర్లెస్ మెసేజ్ వచ్చింది సార్!" హడావుడిగా వచ్చాడు కానిస్టేబుల్.

సి.ఐ. విశ్వనాథం వైర్లెస్ రూమ్‌లోకి వెళ్ళి కాసే

పటికి తిరిగివచ్చాడు.

"ఏమిటి సార్ విశేషం? హెడ్ క్వార్టర్స్‌లో ఏదైనా గొడవ జరిగిందా? మతకల్లోలం, స్టూడెంట్స్ ఏజిటేషన్ ఎట్ సెట్రా?" నవ్వుతూ ప్రశ్నించాడు కృష్ణమూర్తి.

"గాజులపల్లి మర్డర్ కేసు గురించే" నీరసంగా అన్నాడు విశ్వనాథం.

"వాట్ సార్! ఇంతవరకూ యెవర్నీ అరెస్టు చెయ్యనందుకు ఘాటింపా?"

"నో. ఆ చచ్చినవాడు తన అల్లుడేనని యెవరో యస్.పి.గారిని కలుసుకుని పిటీషన్ ఇచ్చాడట."

"మైగాడ్!" నివ్వెరబోతూ అన్నాడు కృష్ణమూర్తి.

"యస్.పి.గారు కేసు ఫయిలు, ఫరదర్ లేటెస్టు రిపోర్టు తీసుకుని హెడ్ క్వార్టర్స్‌కి రమ్మన్నాడు.

"నా రిపోర్టు రెడీసార్!"

"ఈ పూట మనం వెళ్ళేసరికి చీకటి పడిపోతుంది. యస్.పి.గారు క్లబ్బుకి వెళ్తారేమో! అనవసరంగా నైట్ హాల్టు చెయ్యడం ఎందుకు. రేపు వెళ్దాం."

"అదే బెటర్ సార్!" అన్నాడు కృష్ణమూర్తి.

"సెవన్‌కి వచ్చేస్తే యెర్లీగా వెళ్ళిపోవచ్చు" అన్నాడు సి. ఐ.

"ఓ.కె. సార్!" అన్నాడు కృష్ణమూర్తి సెలవు తీసుకుంటూ.

4

అంకమ్మశెట్టికి ఇల్లరికం అల్లుడు సుబ్బయ్య. అతనికి వున్న పిండిమిల్లు నడుపుకుంటూ మామగారింట్లోనే వుండి పోయాడు సుబ్బయ్య.

మామకి కుడిభుజంగా పనిచేసిన అల్లుడు క్రమంగా పెత్తనంలోకి వచ్చాడు. అంకమ్మసెట్టి హాయిగా కృష్ణా రామా అనుకుంటూ కాలక్షేపం చేస్తున్నాడు.

అయితే సుబ్బయ్య పిండిమిల్లు నడపడంతోనే తృప్తి పడలేదు. ఇంకా యెక్కువగా డబ్బు సంపాదించే మార్గాలు అన్వేషించాడు. కాని ఏ వ్యాపారం చెయ్యాలన్నా పెట్టుబడి చాలా అవసరం. పిండిమిల్లుమీద వచ్చే ఆదాయం ఇంటి ఖర్చులకే సరిపోతుంది.

ఇక పోతే అప్పుతెచ్చి వ్యాపారం చెయ్యాలి. ఆ వూళ్ళో అతనికి స్వతంత్ర ప్రతిపత్తి లేదు. మామచాటు మనిషిగానే చెలామణీ అవుతున్నాడు. మామకి తెలియకుండా యెవరూ అప్పు యివ్వరు. మామకి తెలిస్తే అప్పు యివ్వనివ్వడు.

ఇక పెట్టుబడి లేకుండా చేసే వ్యాపారం ఒకటే కనిపించింది సుబ్బయ్యకి.

అది చీటీల వ్యాపారం.

నెలకి వంద చొప్పున కట్టేవాళ్ళని ఏభైమందిని ప్రోగు చేసి వాళ్ళకి మేనేజర్ అయ్యాడు. ఎవరు ఎక్కువ పాడితే వాళ్ళకి చీటీసొమ్ము దక్కుతుంది.

ఈ వ్యవహారం అంకమ్మ శెట్టికి తెలిసి 'ఆ చీటీల వ్యాపారం వద్దురా నాయనా!' అని పోరుపెట్టాడు.

కాని సుబ్బయ్య ముసలాయన మాట పెడచెవిన పెట్టాడు.

కొన్నాళ్ళు చీటీల వ్యాపారం సక్రమంగా సాగింది. కాని అందులో నలుగురు చీటీలు పాడుకున్న వాళ్ళు ఊరి నుంచి పారిపోయేసరికి సుబ్బయ్య పని ఇరుకున పడింది. నెలకి నాలుగువందలు తెచ్చి కట్టాల్సి వచ్చింది.

వ్యాపారం దివాళా తీస్తుందని భయపడి కొందరు డబ్బు కట్టడం మానేసి అప్పటివరకూ కట్టిన డబ్బు తిరిగి యివ్వమని గొడవచేశారు.

సుబ్బయ్య తల్లక్రిందులై పోయాడు. జనానికి యివ్వవలసిన బాకీలు పదిహేనువేల వరకూ తేలింది.

అందులో యెక్కువ చీటీలు కట్టిన రాజమ్మకి నాలుగు వేలు బాకీ తేలాడు. రాజమ్మకి పాడిపంటా కాక ఒక హోటలు గూడా వుంది. ఆ బజార్లో రాజమ్మ హోటలంటే ఉళ్ళో యెవరికైనా తెలుసు.

ఆ రాజమ్మ కొడుకు ఆ వూళ్ళో రౌడీల్లో ప్రముఖుడు. చైన్ బ్యాచీ వాడి చేతిలో వుంది. రాజమ్మ కొడుక్కి భయపడి ఎవరూ ఆమె బాకీలు ఎగవెయ్యరు.

ఒక రోజు రాజమ్మ కొడుకు జగన్, సుబ్బయ్యకోసం మిల్లు దగ్గరికి వచ్చాడు. 'తన తల్లికి యివ్వవలసిన డబ్బు వారంరోజుల్లో యివ్వకపోతే జాగ్రత్త!' అని బెదిరించాడు. "నా సంగతి నీకు తెలియకపోతే మెయిన్ బజార్లో అడుగు. ఎవర్నడిగినా జగన్ సంగతి చెప్తారు." అని "చివరకి డబ్బివ్వకపోతే నీ శవంగూడా దొరకదు" అంటూ మీసాలు మెలేస్తూ పోయాడు.

అల్లుడు మొదలుపెట్టిన చీటీల వ్యాపారం దివాళా ఎత్తిన సంగతి విని అంకమ్మశెట్టి శివాలెత్తాడు. పెళ్ళాం మీద, కూతురి మీద మండిపడ్డాడు.

అతను తలుచుకుంటే అల్లుడిని బాకీల చెరనుంచి విముక్తి చెయ్యడం యెంతోసేపు పట్టదు. కాని అందుకు అతని అంతరాత్మ ఒప్పుకోవడంలేదు. పిండిమిల్లులో శేరు పదిపైసల వంతున ఆడి ఆడి కూడబెట్టిన డబ్బు. జీవితాంతం చెమటోడ్చి సంపాదించిన సొమ్ము. తిన్నదీకాదు,

పెట్టిందీకాదు. వృథాగా ఒకళ్ళకి దారాదత్తం చెయ్యాలంటే మనసొప్పడం లేదు.

ఎంతో మంచివాడనీ అణకువతో వున్నవాడనీ బంధువుల పిల్లవాడనీ అభిమానించి చేరదీసాడు. మిల్లులో పనీ పాటా నేర్పాడు. ఒక్కతే కూతురు. దాన్ని ఏ గుమాస్తాకి యిచ్చినా కట్నాలూ, కానుకలూ, అంటూ ఇరవై వేలు ఖర్చుపెట్టాలి అని ఆలోచించి భార్య వద్దని పోరు పెడుతున్నా పట్టుబట్టి సుబ్బయ్యకిచ్చి పెళ్ళిచేశాడు.

ఆ సుబ్బయ్య యిప్పుడు కొంప ముంచాడు. అప్పుల వాళ్ళు ఇంటిచుట్టూ తిరుగుతూంటే దురదగుండాకు పూసుకున్న వాడిలా మండిపడేవాడు, నిప్పులు తొక్కిన కోతిలా గంతులు వేసేవాడు.

అంతేగాని, ఇపపెట్టెలో డబ్బుమాత్రం తీసేవాడు కాదు.

సెప్టెంబర్ పదో తారీఖు తెల్లవారుజాము నుంచి సుబ్బయ్య కన్పించడంలేదు.

మర్నాడు కూతురు గొడవ పెట్టిందిగాని అంకమ్మశెట్టి కేకలేశాడు. నాలుగు రోజులు ఆగితే వాడే వస్తాడులే అన్నాడు.

ఈ లోపల గాజులపల్లిలో తలలేని మొండెం బైట పడిన సంగతి పత్రికలలో చదివి బేజారెత్తిపోయాడు అంకమ్మశెట్టి.

అతని అల్లుడు గూడా తెల్లబట్టలే వేసుకుని వెళ్ళాడని కూతురు చెప్పినప్పుడు గుండె ఆగిపోయినట్లనిపించింది.

రాజమ్మకొడుకు జగన్, సుబ్బయ్యాని బెదిరించి వెళ్ళిన సంగతి గుర్తొచ్చింది.

ఇంకేంవుంది చలిజ్వరం వచ్చినట్లు వణికిపోయాడు. ఆ రౌడీ ముండాకొడుకే తన అల్లుడిని చంపి గుర్తు తెలియకుండా తల నరికి వేరేచోట పాతిపెట్టాడని కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో రిపోర్టు చేశాడు.

పోలీసులు జగన్‌ని అరెస్టు చేశారు.

డబ్బుపోయి శని పట్టుకున్నట్లయిందని రాజమ్మ గోడు గోడున యేడుస్తూ, కనిపించిన వాళ్ళందరికీ సుబ్బయ్య చేసిన పని చెప్తూ, అటు ఏడు ఇటు ఏడు తరాల వారిని తిడుతూవుంది.

5

గాజులపల్లి హత్యకేసు ఫైలు చదువుతుంటే అంతా గజిబిజిగా కనిపించింది క్రైం ఇన్‌స్పెక్టర్ సురేంద్రకి.

శవం ఎవరిదో తేల్చుకోవడానికి ఇన్వెస్టిగేట్ చేసిన కేసులు యెన్నో వున్నాయిగాని ఒకే శవం తమది అంటూ ముగ్గురు వేర్వేరు వ్యాళ్ళలో రిపోర్టు యిచ్చిన కేసు అతని సర్వీసులో ఇదే మొదటిది.

ముందు శవం ఎవరిదో తేల్చాలి!

తర్వాత హంతకులు ఎవరో కనిపెట్టాలి!!

"వెరీ రిస్కు జాబ్" అన్నాడు సురేంద్ర.

"అందుకే గదా నీకు ఇచ్చింది" అన్నారు ఎస్.పి. నవ్వుతూ.

"ఐ విల్ ట్రై మై లెవెల్ బెస్ట్ సార్!" అన్నాడు సురేంద్ర.

"ప్రమోషన్ లిస్టులో వున్నావు. ఈ కేసు సక్సెస్ చేస్తే మంచిది."

"థాంక్స్."

"ఐ విష్ ఆల్ ది బెస్టు."

సెలవు తీసుకుని బైటపడ్డాడు సురేంద్ర.

ఇన్వెస్టిగేషన్ ఎక్కడ్నుంచి ప్రారంభించాలి? అని ఆలోచిస్తూ ఆఫీసు ఆవరణ దాటాడు.

తల లేని శవం తన భర్తది అని రిపోర్టు యిచ్చింది సీతమ్మ.

తన తమ్ముడు జానయ్య శవం అంటాడు కందిపాలెం పంచాయితీ ప్రెసిడెంట్ లింగయ్య.

తన అల్లుడు సుబ్బయ్యాని ఖూనీ చేశారు బాబోయ్! అని గొడవ పెడుతున్నాడు అంకమ్మ శెట్టి.

ఆరోజు సెప్టెంబర్ 21వ తేదీ. అంటే హత్య జరిగి సరిగ్గా పదిరోజులైంది.

ఆలోచిస్తూ నిల్చున్న సురేంద్రకి రోడ్డు అవతల ఇరానీ హోటల్ స్వాగతం ఇచ్చింది.

అప్పుడతనికి ఆకలి జ్ఞాపకం వచ్చింది.

స్పెషల్ రూమ్‌లో కూర్చుని చికెన్ బిర్యానీకి ఆర్డర్ వేశాడు.

బిర్యాని ఏమంత బాగా లేదు. అది తింటున్నంత సేపూ ఎప్పుడో ఏలూరు రాజ్ విలాస్‌లో తిన్న బిర్యానీ జ్ఞాపకం వచ్చింది. అద్భుతంగా వుంది ఆరోజు. మూడు ప్లేట్లు లాగించాడు.

ఇన్వెస్టిగేషన్ ఏలూరునుంచే మొదలుపెడితే సరి అనుకున్నాడు.

రిక్షా వేసుకుని బస్టాండుకి వెళ్ళాడు.

విజయవాడ వెళ్ళే సూపర్ ఎక్స్‌ప్రెస్ రెడీగా వుంది. అందులో ఎక్కి కూర్చున్నాడు.

ఏలూరు చేరేసరికి రాత్రి ఎనిమిదయింది.

ఇక ఆ పూటకి రెస్టు తీసుకోవడమే శరణ్యాం అను కున్నాడు.

హోటల్లో రూమ్ తీసుకొని భోజనం చేసి నిద్ర పోయాడు.

జగన్నాథం పని చేస్తున్న ఆఫీసు కలెక్టర్ ఆఫీసుకి దగ్గర్లోనే వుంది.

ఆ ఆఫీసు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ది.

సురేంద్ర విజిటర్స్ రూమ్‌లో కూర్చుని స్లిప్ రాసి అటెండర్ ద్వారా పంపించాడు.

కాసేపటికి సురేంద్రకి పిలుపు వచ్చింది.

స్ప్రింగ్ డోర్ నెట్టుకుని వెళ్ళి విష్ చేసి కూర్చు న్నాడు సురేంద్ర. తర్వాత ఐడెంటిటీ చూపించాడు.

"గ్లాడ్ టూ మీట్ యు" అన్నాడు యింజనీర్ సింగ్.

సురేంద్ర షేక్‌హాండ్ ఇచ్చాడు.

"ఐ వాంట్ యువర్ కోపరేషన్" అన్నాడు సురేంద్ర.

ప్రశ్నార్థకంగా చూశాడు ఇంజనీర్ సింగ్.

"జగన్నాథం అనే అటెండర్ మీ ఆఫీసులోనే పని చేస్తున్నాడు గదా!"

"అవును."

"ఆ కేసు ఇన్వెస్టిగేట్ చేస్తున్నాను."

"ఐ.సీ." అని తలూపుతూ "అతని వైఫ్ రోజూ ఆఫీసుకు వస్తూనే వుంది. జగన్నాథం ఎక్కడో మర్డర్ చెయ్యబడ్డాడనీ, అతనికి రావలసిన ఫ్యామిలీ బెనిఫిట్ ఫండ్, జి.పి.యఫ్., ఇప్పించమనీ అడుగుతూ వుంది. కాని యెలా యివ్వగలం? నేచురల్ డెత్ అయితే వెంటనే

యిచ్చి వుండేవాళ్ళం. బట్ ఇటీజ్ ఎ మర్డర్ కేస్. డెత్ సర్టిఫికెట్ లేకుండా ఇవ్వలేమని చెప్పేశాను. వచ్చి ఏడుస్తుంది. ఐ పిటీ హెర్" అన్నాడు సింగ్.

"జగన్నాథం నాగార్జునసాగర్‌లో పనిచేస్తూ ఇక్కడికి ట్రాన్స్‌ఫరై వచ్చాడు."

"అవును."

"అతనితోపాటు అక్కడినుంచీ వచ్చినవాళ్ళు ఇంకా ఎవరైనా వున్నారా?"

"లేకేం. నలుగురు వున్నారు."

"అందులో జగన్నాథంతో మూవ్ అయ్యేవారు ఎవరైనా వున్నారా?"

సింగ్ కాసేపు ఆలోచించి "వాళ్ళ అటెండర్ జేమ్సు వున్నాడు. ఇద్దరూ క్లోజుగా వుండడం నేను అనేకసార్లు గమనించాను" అన్నాడు.

"మీరు పర్మిషన్ ఇస్తే అతన్ని ఇంటర్వ్యూ చేస్తాను" అన్నాడు సురేంద్ర నవ్వుతూ.

"స్ట్రెన్జ్..." అంటూ కాలింగ్ బెల్ నొక్కాడు సింగ్.

అటెండర్ వచ్చాక "జేమ్సుని పిలువు" అన్నాడు.

కాసేపటికి జేమ్సు వచ్చాడు.

నల్లగా పొడుగ్గా వున్నాడు జేమ్సు. ముఖ్యంగా పైనే వుంటాయి అతనికి.

"నీ పేరు జేమ్సు కదూ!" అన్నాడు సురేంద్ర.

"అవును సార్!" వినయంగా అన్నాడు జేమ్సు.

"జగన్నాథం నీకు స్నేహితుడా?"

"అవును సార్! ఇద్దరం ఒక్కసారే వుద్యోగంలో

చేరాం" అన్నాడు జేమ్సు పాత రోజులు జ్ఞాపకం చేసుకుంటూ.

"జగన్నాథం పేకాట ఆడతాడా?"

"ఆడతాడు సార్!"

"నువ్వు ఆడవా?"

"నాకు పేకాట రాదు సార్!" నవ్వుతూ అన్నాడు జేమ్సు.

"ఐ.సీ...." అంటూ నవ్వాడు సింగ్ గూడా.

"జగన్నాథం గురించి ఏం చెప్తావు?"

జేమ్సు బుర్ర గోక్కున్నాడు యేం చెప్పాలో అర్థం కాక.

"నీకు తెలిసింది చెప్పు. నీకేం ప్రమాదం లేదులే!" అన్నాడు ఇంజనీర్ హోమీ ఇసూ.

"అందరికీ తెలిసిందే సార్. వాడు పేకాడతాడు. సారా త్రాగుతాడు."

"ఊఁ...."

"అంతే సార్."

"అతనికి నాగార్జునసాగర్‌లో వున్నప్పుడే పెళ్ళయింది గదా? ఈ వ్యసనాలున్న వాడికి పిల్లని ఎట్లా ఇచ్చారు?" ప్రశ్నించాడు సురేంద్ర.

"వాడికి పెళ్ళెక్కడయింది సార్? పెళ్ళి కాలేదు" అన్నాడు జేమ్సు.

"పెళ్ళి కాలేదా?" ఆశ్చర్యపోయాడు సురేంద్ర.

"మరి ఆవిడ ఎవరోయ్?"

"సీతమ్మ ఎవరు?"

ఇద్దరూ ఒకేసారి ప్రశ్నించారు.

"అది పెళ్ళాం కాదు సార్. ఉంచుకున్నాడు దాన్ని.

అది ముందల కంపెనీలో వుండేది సార్ సాగర్‌లో వున్నప్పుడు. అక్కడ పరిచయం జగన్నాథానికి. ట్రాన్స్‌ఫర్ అయ్యాక దాన్ని కూడా తెచ్చుకుని కాపురం చేస్తున్నాడు అంతే" అన్నాడు జేమ్సు.

అదంతా విని సింగ్ ఆశ్చర్యపోయాడు.

"ఇదంతా నాకు తెలీదు మిష్టర్ సురేంద్ర. ఇప్పుడే వింటున్నాను" అన్నాడు.

"ఐ.సీ." అన్నాడు సురేంద్ర.

"పోనీ యిప్పుడైనా ఆమె బుద్ధిగా వుంటుందా?" అన్నాడు సింగ్.

"ఎక్కడ సార్? కుక్కతోక వంకరే" నవ్వుతూ అన్నాడు జేమ్సు.

"మిష్టర్ జేమ్సు. జగన్నాథం సెలవు పెట్టకుండా ఎక్కడికో ఎందుకు వెళ్ళాడు? దానిమీద ఏమైనా చెప్పగలవా?"

జేమ్సు తల గోక్కున్నాడు.

"నాకు అదే అర్థంకావడంలేదు సార్!" అన్నాడు.

తర్వాత జేమ్సుకి "థాంక్స్" చెప్పాడు సురేంద్ర.

"జగన్నాథం సర్వీస్ బుక్ ఒకసారి తెప్పిస్తారా? అందులో అతని పుట్టుమచ్చలు నోట్ చేసివుంటారుగదా!" అన్నాడు.

"ఎస్....ఎస్...." అని కాలింగ్ బెల్ నొక్కి ఎస్టాబ్లిష్‌మెంట్ క్లర్క్‌ని పిలిపించి జగన్నాథం సర్వీస్ బుక్ తెప్పించాడు సింగ్.

సర్వీస్ బుక్‌లో అతని కుడిచేతిమీద ఒక పుట్టుమచ్చ, ముఖంమీద కుడి కంటిక్రింద ఒక మచ్చ వున్నట్లు రికార్డు చేసి వుంది.

తర్వాత సర్వీస్ బుక్‌లో వున్న జగన్నాథం చేతి వ్రేలి ముద్రలు, భూతద్దంతో పరిశీలించాడు.

గాజులపల్లిలో మర్డర్ చేయబడ్డవాడు జగన్నాథం కాదని తేలిపోయింది.

ఫింగర్ ప్రింట్స్ టాలీ కాలేదు.

పావుగంటసేపు సురేంద్ర చేస్తున్నదంతా గమనిస్తూ ఆసక్తిగా చూస్తున్నాడు సింగ్.

"గాజులపల్లిలో మర్డర్ చేయబడింది మీ అటెండర్ జగన్నాథం కాదు" అన్నాడు సురేంద్ర.

"మరి అతని భార్య అలా అంటుందేమిటి?"

సురేంద్ర మౌనం వహించాడు.

"అయితే జగన్నాథం ఏమైనట్లు?" అన్నాడు సింగ్.

"యూ డూ వన్ థింగ్" అన్నాడు సురేంద్ర.

ఏమిటి? అన్నట్లు చూశాడు సింగ్.

"జగన్నాథం కనిపించడం లేదని పోలీస్ రిపోర్టు ఇవ్వండి" అన్నాడు సురేంద్ర.

సింగ్ ఆలోచనలో పడిపోయాడు.

"ఎందుకు ఆలోచిస్తున్నారు? మీ రూల్సు పర్మిట్ చెయ్యవా?" ప్రశ్నించాడు సురేంద్ర.

"ఎందుకు చెయ్యవూ? అతని భార్య డబ్బుకోసం రోజూ ఆఫీసుకి వచ్చి అడుగుతున్నది. అప్లికేషన్ కూడా పెట్టింది తన భర్త గాజులపల్లిలో హత్య చేయబడ్డాడనీ తనకు రావలసిన డబ్బు ఇప్పించమనీ. డెత్ సర్టిఫికెట్ కోసం ఎదురుచూస్తున్నాము. ఆమె పెట్టిన అప్లికేషన్ రిఫర్ చేస్తూ డెత్ సర్టిఫికెట్ వెంటనే పంపమని పోలీసులకు లెటర్ రాస్తాను. దేన్ ఎండ్స్ ద మాటర్" అన్నాడు సింగ్.

"థాంక్స్ ఫర్ యొవర్ కైండ్ కోపరేషన్" చెయ్యి కలుపుతూ అన్నాడు సురేంద్ర.

"నో మెన్షన్" అన్నాడు సింగ్ నవ్వుతూ.

సురేంద్ర ఆఫీసునుంచి బైట పడ్డాడు.

6

"మిష్టర్ కృష్ణమూర్తీ, సీతమ్మ ఘటికురాలోయ్! గుండెలు తీసిన బంటు అంటారు చూడు అటువంటిరకం" అన్నాడు సురేంద్ర తను ఏలూరులో ఇన్వెస్టిగేట్ చేసిన విశేషాలు చెపుతూ.

ఎస్.ఐ. కృష్ణమూర్తి ఆసక్తిగా వింటూ కూర్చున్నాడు.

"జగన్నాథం డెత్ సర్టిఫికెట్ పంపమని సీతమ్మ పెట్టుకున్న అప్లికేషన్ జత చేస్తూ, పోలీసులకు రాశాడు వాళ్ల ఇంజనీర్. దాంతో తీగంతా లాగారు ఏలూరు సి.ఐ.డి. వాళ్ళు.

మర్నాడు నేను కూడ వాళ్ళకి క్లూ ఇచ్చాననుకో.

సీతమ్మని, ఆమె ప్రియుడు నాగరాజుని అరెస్టు చేసేసరికి అంతా బైట పడింది.

నాగరాజుకి నాలుగు తగిలించేసరికి తనూ, సీతమ్మ కలసి జగన్నాథాన్ని చంపినట్లు ఒప్పుకున్నాడు. అతని శవాన్ని శనివారపేట దగ్గర్లో ఏట్లో కప్పి పెట్టారు" అన్నాడు సురేంద్ర.

"సీతమ్మని చూడగానే ఇది బ్రోతల్ అనిపించింది గాని అనుమానించలేకపోయాను. ఎందుకంటే కొందరు కుల స్త్రీలు కూడా ఒక్కొక్కసారి బ్రోతల్ కేసులే అని అనుమానం వస్తుంది. వాళ్ళ వేషధారణ అట్లా వుంటుంది మరి" అన్నాడు ఎస్.ఐ. కృష్ణమూర్తి.

"సరే మొగుగ్గా జగన్నాథం గొడవ వదిలిపోయింది. పోతే కందిపాలెంలో జానయ్య యెవరో యేమిటో చూడాలి."

"వాళ్ళ అన్న డెత్ సర్టిఫికెట్ ఇవ్వమని ఒకటే గొడవ పెడుతున్నాడు."

"ఎందుకో అంత తొందర?"

"జానయ్య బాచ్‌లర్. పెళ్ళాం పిల్లలు లేరు."

"ఆస్తి కోసమా!"

"ఆస్తి యెక్కడికి పోతుంది? జానయ్య పేరుతో పాతిక వేలకి ఇన్స్యూరెన్సు పాలసీ వుంది. ఆ డబ్బుకోసం తిరుగుతున్నాడు. ఎల్.ఐ.సీ. ఫీల్డు ఆఫీసర్ గూడా వచ్చి కలిశాడు. ఆ శవం యెవరిదో యింకా తేలలేదనీ, డెత్ సర్టిఫికెట్ ఇవ్వడం సాధ్యపడదనీ చెప్పాను" అన్నాడు ఎస్.ఐ. కృష్ణమూర్తి.

"కందిపాలెం రేపు వెళ్ళాలనుకుంటున్నాను. ఆ ఏరియా ఎస్.ఐ. థామస్‌ని అనుకుంటాను" అన్నాడు సురేంద్ర.

కృష్ణమూర్తి తల వూపాడు.

7

జానయ్య కేసుగూడా జగన్నాథం కేసులాంటిదేమో నని అనుమానం పీడిస్తోంది సురేంద్రని.

కందిపాలెం వెళ్ళడానికి ఆర్టీసీబస్సు లేదు. ప్రైవేటు బస్ వుంది. రోడ్డు సరిగాలేక చెయ్యి తిన్నవాళ్ళకల్లా బస్ ఆపుకుంటూ కందిపాలెం వెళ్ళేసరికి రెండు గంటలు పట్టింది.

బస్సు ఆగిన సెంటర్‌కి దగ్గిరలోనే వుంది లింగయ్యగారి ఇల్లు. ఏమంత శ్రమ పడకుండానే యింటికి వెళ్ళాడు.

లింగయ్య పెద్దపులిలా హాల్లోనే కూర్చుని వున్నాడు చుట్టూ నలుగురు సిల్కు లాల్చీల పెద్దమనుషులు కబుర్లు చెపుతూ నవ్వుతూ వున్నారు.

సురేంద్రని చూసి "రండి....రండి...."అంటూ ఆహ్వానించి కుర్చీ చూపించాడు లింగయ్య.

సురేంద్ర కూర్చుని ఐడెంటిటీ చూపించి "మీతో ఏకాంతంగా మాట్లాడాలి" అన్నాడు.

లింగయ్య పడక కుర్చీలోంచి లేచి "రండి...." అంటూ ఒక గదిలోకి దారి తీశాడు.

గది విశాలంగా వుంది. గదికి ఒక మూల టేకో వుడ్ టేబులు, దానిమీద స్టాండ్ వేసి పెద్ద అద్దం, ప్రక్కనే టెలిఫోను, రెండు కుర్చీలు వున్నాయి.

తను ఒక కుర్చీలో కూర్చుని "కూర్చోండి...." అన్నాడు.

"మీకు తెలిసిన సంగతే గదా! గాజులపల్లెలో తల లేని మొండెశవం తను వాళ్ళదే అని నుగురు రిపోర్టు యిచ్చారు. అందులో ఏలూరు నుంచి వచ్చిన సీతమ్మ భర్త జగన్నాథంది కాదని ఇన్వెస్టిగేషన్లో తేలింది. ఇకపోతే మీ తమ్ముడు జానయ్య అంకమ్మశెట్టి అల్లుడు సుబ్బయ్యలలో ఒకరదై వుండాలి."

సురేంద్ర మాటలు విని లింగయ్య సంతోషించినట్లే కనిపించాడు.

"మీరు తొందరగా డెత్ సర్టిఫికెట్ ఇప్పిస్తే మాకు వుపయోగం వుంటుంది" అన్నాడు.

"డెత్ సర్టిఫికెట్ ఎంతసేపట్లో వస్తుంది? ఆ శవం మీ తమ్ముడిగారిదని తేలాలిముందు" అన్నాడు సురేంద్ర.

"దానికి నన్నేం చెయ్యమంటారు చెప్పండి? ఎవరికి

యెవరితో చెప్పించాలి. డైరెక్టరుతో హాస్పటల్ సూప
ర్నెంట్ కి చెప్పించనా?" అన్నాడు లింగయ్య.

నరేంద్ర నవ్వి "అదేం అవసరం లేదు. ప్రస్తుతం జానయ్య వేలిముద్రలు దొరికితే చాలు. శవం అతనిదే అని నిర్ధారణ చేసి సర్టిఫికెట్ పంపిస్తాము" అన్నాడు.

"వాడు చచ్చిపోయి పదిహేను రోజులైంది గదా! వేలిముద్రలు యెక్కడ దొరుకుతాయి?" ఆశ్చర్యంగా అడిగాడు లింగయ్య.

"జానయ్య వాడుతున్న గది చూపిస్తే ట్రై చేస్తాను" అన్నాడు లింగయ్య.

లింగయ్య, జానయ్య వుండే గది తలుపులు తీశాడు.

గదిలో యెక్కువ సామాను లేదు. నవారు మంచం ఒక మూలవుంది. పరుపు చుట్టచట్టి దానిమీద వుంది. రెండు కుర్చీలు, ఒక చిన్నటీపాయి వున్నాయి. గోడకి అలమారా వుంది. గోడకి అద్దం వ్రేలాడుతూ వుంది. ఒకమూల కూజా, గ్లాసు, దండెంమీద బట్టలు వున్నాయి.

అద్దంమీద, గ్లాసుమీద పౌడర్ చల్లాడు. వేలిముద్రలు రాలేదు. బట్టలు తీసి చూశాడు. అన్నీ తెల్లవే వున్నాయి. టైలర్ స్లిప్పులుగాని, చాకలి మార్కులుగాని కనిపించలేదు.

ఇంతలో ప్రక్కగదిలో టెలిఫోన్ మ్రోగింది. లింగయ్య గది బైటకి వెళ్ళాడు.

కాసేపటికి లోపలకి వస్తూ "ఇన్స్పెక్టర్ గారూ! మా జానయ్య బ్రతికే వున్నాడండీ" అన్నాడు.

సురేంద్ర నివ్వెరపోతూ "ఎక్కడున్నాడు?" అన్నాడు.

"బాంబేలో వున్నాడు. ఫోన్ వచ్చింది" అన్నాడు లింగయ్య.

"ఐయామ్ వెరీ గ్లాడ్" అన్నాడు సురేంద్ర లింగయ్యకి షేక్‌హాండ్ ఇస్తూ.

లింగయ్య నవ్వాడు. కాని ఏమంత సంతోషం వ్యక్తపరచలేదు.

"నాకు పని తప్పింది లెండి" అని నవ్వుతూ సెలవు తీసుకున్నాడు.

8

హెడ్‌క్వార్టర్స్‌కి వచ్చాక ఎస్.పి. చెప్పిన మాటలు విని ఆశ్చర్యపోయాడు సురేంద్ర.

"సుబ్బయ్య మామగారింటికి తిరిగి వచ్చాడట. కేసు విత్‌డ్రా చేసుకున్నాడు" అన్నాడు.

"ఇన్నాళ్ళూ ఎక్కడున్నాడు?"

"వాళ్ళ స్వగ్రామం వెళ్ళాడట. అక్కడ తన పేరుతో వున్న పొలం అమ్మి డబ్బు తెచ్చి అప్పులు తీర్చాడట."

"చంపాడు పొండి. వెళ్ళేవాడు మామకి చెప్పకుండా ఎందుకు వెళ్ళాడు?"

"అదే సస్పెన్స్."

"మన ప్రాణాలు తియ్యడానికి" నవ్వాడు సురేంద్ర.

"ఇటువంటివాళ్ళే మన డిపార్టుమెంటుకి శ్రీరామ రక్ష." నవ్వాడు ఎస్.పి.

"అనవసరంగా జగన్‌ని అరెస్టు చేశాం కదండీ."

"అప్పటి పరిస్థితి అటువంటిది."

"అయితే కేస్ రికార్డు చేస్తే పోతుంది."

"నేనూ అదే అనుకుంటున్నాను" అన్నాడు ఎస్.పి.

"మొండి శవం ఎవరిదో తేలకుండా కేసు మళ్ళీ మొదటికే వచ్చింది" అన్నాడు.

"ఏం చేస్తాం? ఒక్కో కేసు అలా వుంటుంది."

9

మిర్యాలగూడాలో రైసుమిల్లు ఓనర్ రత్నారావు సురేంద్రకి స్నేహితుడు. అక్కడ మేడ కట్టాడు యీ మధ్యనే. గృహప్రవేశానికి తప్పకుండా రమ్మని యిన్విటేషన్ కార్డుకి పర్సనల్ లెటర్ పిన్ చేసి రిజిష్టర్ పోస్టులో పంపాడు.

వెళ్ళకపోతే నొచ్చుకుంటాడని ఒకరోజు ముందుగానే వెళ్ళాడు.

గృహప్రవేశం గొప్పగా జరిగింది.

రత్నారావు, అతని భార్య బలవంతం చేస్తే మరొక రెండు రోజులు వాళ్ళింట్లోనే అతిథిగా వుండిపోయాడు సురేంద్ర.

అప్పటికే వచ్చి మూడురోజులైంది. ఇక ఆ సాయంకాలం వెళ్ళడానికి నిర్ణయించుకున్నాడు.

మధ్యాహ్నం భోజనం చేసి పాన్ వేసుకుంటూ రత్నారావుతో కబుర్లు చెపుతూ కూర్చున్నాడు సురేంద్ర.

ఇంతలో రత్నారావు కొడుకు పద్నాలుగేళ్ళవాడు వచ్చి "నాన్నా! ఈ లెటర్ అమెరికానుంచి వచ్చిందా?" అంటూ తండ్రి చేతికి ఒక ఇన్‌లాండ్ లెటర్ అందించాడు.

రత్నారావు కొడుకు ప్రక్కనే, అదే వయస్సున్న మరో కుర్రాడు నిల్చుని వున్నాడు.

"ఎవరన్నారు అమెరికానుంచి వచ్చిందని?" అన్నాడు రత్నారావు నవ్వుతూ.

"సుబ్రహ్మణ్యం అంటున్నాడు నాన్నా!" అన్నాడు రత్నారావు కొడుకు.

సుబ్రహ్మణ్యం అనే పుత్రుడు వికృతముఖం వేసి "నిజం మావయ్యగారూ! ఇది అమెరికానుంచి వచ్చిందే. మా సూర్యం మావయ్య రాశాడు. కావాలంటే చదవండి" అన్నాడు.

"ఆ లెటర్ ఇటివ్వు నేను చూస్తాను" అని సురేంద్ర తీసుకుని చూశాడు.

అది ఇన్‌లాండ్ లెటర్. హైదరాబాద్ జి.పి.ఓ.లో పోస్టు చేసినట్లు ముద్ర వుంది దానిమీద. సెప్టెంబర్ ఇరవై రెండు అని తారీఖు వుంది.

అందులో ఇలా వుంది.

"ప్రియమైన అక్కగారికి అనేక నమస్కారములు చేసి వ్రాయునది—

నేను మన వూరునుంచి బొంబాయికి వచ్చి విమానంలో అమెరికా వెళ్ళాను.

మన తెలుగువాళ్ళు చాలమంది వున్నారు. ముఖర్జీ గారని తెలుగాయన యింట్లోనే వుంటున్నాను. పిల్లలకి ఆహారం తయారుచేసే ఫ్యాక్టరీలో పని చేస్తున్నాను. నెలకి ఆరువేలు జీతం వస్తోంది. కాని ఖర్చులు యెక్కువ. నెలకి వెయ్యికంటే ఎక్కువ మిగలవు.

నీకు డబ్బు పంపడానికి ఇక్కడ గవర్నమెంటు ఒప్పుకోదని తెలిసింది. కాబట్టి నేను ఒక సంవత్సరం ఆగిన తర్వాత వస్తాను. వచ్చేటప్పుడు డబ్బు గాని లేకపోతే ఏవైనా వస్తువులుగాని తెస్తాను.

బావగారికి నా నమస్కారములు. సుబ్రమణ్యానికి నా ముద్దులు.

ఇట్లు,
మీ తమ్ముడు,
సూర్యం."

అది చదివి దీర్ఘంగా నిట్టూర్చాడు సురేంద్ర.

దాన్ని మడతపెట్టి పట్టుకుని "బాబూ! సుబ్రమణ్యం మీ అమ్మ పేరు ఏమిటి?" అన్నాడు.

"మా అమ్మ పేరు కమలమ్మండీ!" అన్నాడు.

"కమలమ్మ నీకు తెలుసురా!" అన్నాడు సురేంద్ర.

"తెలుసురా. వీళ్ళకి ప్రక్కవూళ్ళో పొలాలున్నాయి. ఆమె తమ్ముడు యేదో వుద్యోగం దొరికిందని అమెరికా వెళ్ళాడట. నాకూ వాళ్ళతో ఏమంత టచ్ లేదు. పోతే మనవాడికి స్నేహితుడు" అన్నాడు.

"మొత్తానికి యిందులో యేదో మోసం వున్నట్లు నాకు అనుమానంగా వుంది" అన్నాడు సురేంద్ర.

"నీ పోలీసు బుద్ధి పోనిచ్చుకున్నావుగాదు. ఎప్పుడూ వెధవ అనుమానాలే నీకు" అన్నాడు రత్నారావు నవ్వుతూ.

"ఈ లెటర్ చదివిచూడు, నీకే తెలుస్తుంది. అమెరికా నుంచి రాస్తున్నా నంటాడు. పోస్టులో వేసింది హైదరాబాదులో."

సురేంద్ర లెటర్ రత్నారావుకి అందించాడు.

రత్నారావు అది చదివి "తమ్ముడు అక్కకి రాశాడు లెటర్. అక్కని మోసం చెయ్యాల్సిన పనేముంది?" అన్నాడు.

"అదే గమ్మత్తుగా వుంది. మొత్తానికి ఈ సూర్యం

అమెరికా వెళ్తున్నానని అక్కడ దగ్గర డబ్బేమైనా తీసుకెళ్ళి వుండవచ్చును. అక్కడికి అనుమానం రాకుండా యీ లెటర్ రాసివుంటాడు. ఇతను హైదరాబాద్‌లోనే వుండి వుంటాడు” అన్నాడు సురేంద్ర.

“పోనియ్. అతని గొడవ మనకెందుకు?” అన్నాడు రత్నారావు.

సురేంద్ర మాట్లాడలేదు. అతని బుర్రలో అనుమానం పురుగు జేరి తొలుస్తూ వుంది.

“ఏమిట్రా ఆ దీర్ఘాలోచన? కొంపతీసి ఈ లెటర్ పట్టుకుని యిన్వెస్టిగేషన్ మొదలుపెడతావేమిటి?” అన్నాడు రత్నారావు నవ్వుతూ.

“అవును” అన్నాడు సురేంద్ర పరధ్యానంగా.

“ఎంత పోలీసు బుద్ధి అయితే మాత్రం ఇదేం బుద్ధిరా నీకు? ఎక్కడబడితే అక్కడ ఇన్వెస్టిగేషన్ మొదలు పెట్టడమేనా?” అన్నాడు రత్నారావు.

సురేంద్ర నవ్వి “నీకు అదంతా తర్వాత చెప్తాను” అని “బాబూ! సుబ్రమణ్యం మీ యిల్లెక్కడ?” అన్నాడు.

“నల్లగొండ పోయే రోడ్డులో వుందండీ!” అన్నాడు సుబ్రమణ్యం.

“దగ్గరేనా?”

తల వూపాడు ఆ కుర్రాడు.

“పద పోదాం” అని ఆ కుర్రాడి వెనుకే నడిచాడు సురేంద్ర.

ఆ ఇంట్లో నడివయస్సు ఆమె తప్ప ఎవరూ లేరు. వాకిట్లో కూర్చుని బియ్యం ఏరుకుంటున్నదల్లా తన కొడుకు వెనకే వస్తున్న సురేంద్రని చూసి లేచి నిల్చుంది.

ఆమె కమలమ్మ అని గ్రహించి "నమస్కారమండీ! నేను సురేంద్రను. పోలీస్ డిపార్టుమెంటులో పని చేస్తున్నాను. మీతో కొంచెం పని వుండి వచ్చాను" అన్నాడు.

పోలీస్ పేరు వినగానే ఆమె కొంచెం కలవరపడినట్లు కనిపించింది. ప్రతిసమస్కారం చేసి "రండి.... లోపల కూర్చుంటురుగాని" అని కుర్చీ తెచ్చి వేసింది.

సురేంద్ర కూర్చుని "మీ తమ్ముడు సూర్యం రాసిన లెటర్ చదివి వచ్చాను" అన్నాడు.

"మా తమ్ముడు మీకు తెలుసా?" ఆనందంతో అంది.

"లేదు." అన్నాడు.

ఆమె అర్థం కానట్లు ముఖం చిట్లించి చూసింది.

"మీ తమ్ముడు అమెరికా వెళ్ళి అక్కడనుంచి లెటర్ రాశాడని మీరు అనుకుంటున్నారు గదూ!" అన్నాడు.

ఆమె తల వూపింది.

"అతను అమెరికా వెళ్ళలేదు. హైదరాబాద్ నుంచి ఆ లెటర్ రాశాడు" అన్నాడు సురేంద్ర.

ఆమె ఆశ్చర్యంగా చూసింది కళ్ళు పెద్దవిచేసి.

"నాకు చదువు రాదు. వాడి బావగారికి కూడా చదువు రాదు. ఏదైనా వుత్తరంమూకొస్తే వస్తే వీడే చదివి వినిపిస్తాడు. మాకేం తెలుస్తుంది ఎక్కడ్నుంచి వచ్చిందీ?" అంది కమలమ్మ.

"మీరు వున్నసంగతి వున్నట్లుగా చెప్తే మీ తమ్ముడు ఏ వూళ్ళో వున్నదీ చెప్పగలుగుతాం" అన్నాడు.

"అడగండి" అంది ఆమె.

"మీ తమ్ముడు అమెరికా వెళ్ళడానికి డబ్బు ఏమైనా తీసుకెళ్ళాడా?"

"విమానం చార్జీలకని ఆరువేలు కావాలని పోరుపెట్టి

పట్టుకెళ్ళాడు. వాళ్ళ బావగారు తనను ఇవ్వనని మొండికేస్తే తన పొలం అమ్మి యివ్వమని పోట్లాడాడు."

"అయితే అతని పొలం యెక్కడుంది?"

"మా పొలం ప్రక్కనే."

"మీకు అమ్మానాన్న ఎక్కడున్నారు?"

"ఇద్దరూ పోయారు. వీడిని మేమే పెంచాం. వాడి పొలం వాళ్ళ బావే చూస్తున్నాడు. వాడు బి.ఏ. చదివి వుద్యోగంకోసం తిరుగుతున్నాడు. పొలం పని తనే చెయ్యాలని మొండికేశాడు."

సురేంద్ర కళ్ళు మూసుకుని వింటున్నాడు.

"ఆ మెరికాలో మీ బంధువులు యెవరైనా వున్నారా?...."

"ఎవరూ లేరు."

"మరి అమెరికా వెళ్ళడానికి మీరెలా ఒప్పుకున్నారు? చాలదూరం కదా?"

"ఎవరో స్నేహితుడు వుద్యోగం యిప్పిస్తాడని చెప్పాడు."

"అతన్ని మీరు ఎప్పుడైనా చూశారా?"

"అతను హైదరాబాద్‌లో యేదో ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. మా యింటికి ఒక్కసారే వచ్చాడు. అతనితో పాటు మా ప్రక్కింట్లో పాండుగూడా వచ్చాడు. పాండుకి అతను బాగా తెలుసు. పాండు ద్వారానే అతను మా తమ్ముడికి స్నేహితుడయ్యాడు" అంది కమలమ్మ.

"ఐ. సీ...." అన్నాడు సురేంద్ర తల వూపుతూ.

"ఏమిటి?"

"ఏంలేదు. అమెరికా వెళ్ళేరోజున పాండు గూడా మీ తమ్ముడితోపాటు ఈ వూరినుంచి వెళ్ళాడా?"

"ఆс.... వెళ్ళాడు. బస్సులో హైదరాబాద్ వరకూ వెళ్ళి విమానం యెక్కించి వస్తానని చెప్పి వెళ్ళాడు" అంది కమలమ్మ.

సురేంద్ర మౌనంగా ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు.

10

సాయంకాలం చీకటిపడుతూ వుండగా పోలీస్ వాన్ వచ్చి పాండు ఇంటిముందు ఆగింది.

పాండు సినిమాకి వెళ్దామని ముస్తాబై యింట్లో నుంచి బైటికి వచ్చాడు.

పోలీస్ కానిస్టేబుల్సు హఠాత్తుగా అతన్ని చుట్టుముట్టి పట్టుకుని వాన్‌లో ఎక్కించారు.

"నీ పేరు పాండు గదూ?" సి.ఐ. ప్రశ్నించాడు.

"అవున్సార్!" ముచ్చెమటలు పోస్తూ వుండగా అన్నాడు పాండు.

"నిన్నెందుకు తీసుకొచ్చామో తెలుసా?"

"తెలియడంలేదు సార్! నేనేం పాపం చెయ్యలేదు సార్!" వణుకుతున్న కంఠంతో అదురుతున్న గుండెలతో అన్నాడు.

"మీ ఫ్రెండు సూర్యం గుర్తున్నాడా?"

పాండు తెల్లముఖం వేశాడు సూర్యం పేరు వినగానే. భయంతో శరీరం వణికిపోసాగింది.

"ఆ దేనయ్యా! అమెరికా వెళ్ళాడు చూడు అతను."

తల వూపాడు నీరసంగా.

"నువ్వు దగ్గరుండి విమానం ఎక్కించావు గదూ!"

"అవును సార్!"

"ఎక్కడ? హైదరాబాద్‌లోనా? బొంబాయిలోనా?"

"హైదరాబాద్ లో సార్!"

"ఆ ప్లేన్ హైదరాబాద్ నుంచి సూటిగా వెళ్తుందా? లేక మధ్యలో ఆగుతుందా?"

"నాకు తెలియదు సార్!"

"అమెరికా వెళ్ళాక సూర్యం లెటర్ రాశాడా నీకు?"

"ఇంకా రాయలేదు సార్!"

"ఇంకేం రాస్తాడు. పాపం అతను అమెరికా వెళ్ళ లేదుగా!"

పాండు ఆశ్చర్యంగా చూశాడు.

"నిన్ను తీసుకురమ్మని కబురు చేశాడు."

పాండు నివ్వెరపోయాడు.

"స్వర్గాపూర్ లో వున్నాడు ప్రస్తుతం. అతన్ని చూడా లని వుందా?" నవ్వుతూ అన్నాడు సి.ఐ.

పాండు నోటివెంట మాటలు రాలేదు.

"నిజం చెప్తావా? లేక సూర్యం దగ్గరికి వెళ్తావా?"

'సూర్యం దగ్గరికి వెళ్ళడం అంటే!' పాండు కళ్ళు పెద్దవయ్యాయి.

అమాంతం సి.ఐ. కాళ్ళమీద పడిపోయాడు. "నాకేం తెలియదు సార్! నన్ను రక్షించండి." అన్నాడు యేడుస్తూ.

సి.ఐ. నవ్వుతూ "కుర్రాడు బుద్ధిమంతుడే!" అని పైకి లేవదీస్తూ "లే నాయనా.... లే.... జరిగిందంతా చెప్పా వంటే నీకేం కష్టం కలగదు. నిజం చెప్పు చాలు" అన్నాడు.

పాండు జరిగిందంతా చెప్పాడు:

బ్లాక్ బెల్టు బాలు తన ఫ్రెండ్స్ మూలంగా హైదరాబాద్ లో ఒక బార్ లో పరిచయమయ్యాడు. సోడా కలుపుకోకుండా ఫుల్ బాటిల్ త్రాగి కంట్రోల్లో వున్న బాలు అంటే ఆకర్షింపబడ్డాడు పాండు.

అతను చెప్పిన కబుర్లుగూడా యెంతో విచిత్రంగా వున్నాయి. తను తరుచు ఫారిన్ గూడా వెళ్తుంటాననీ, కస్టమ్స్‌వాళ్ళ కళ్ళు గప్పి స్మగుల్డు వాచీలు, గోల్డు, కెమెరాలు తెచ్చి అమ్ముతుంటాననీ తన గురించి చెప్పాడు. సంపాదించిన డబ్బంతా బార్ లలోను, కాల్ గర్ల్స్‌కి ధారపోస్తుంటానని గర్వంగా అన్నాడు.

అతని మాటలు వింటూవుంటే తాముగూడా అలా స్మగ్లర్స్‌గా మారి అతను అనుభవించే సుఖాలు అనుభవించాలన్నంత ఇన్స్పిరేషన్ వస్తుంది. అతని నివాసం సనత్ నగర్ లో చిన్న గది.

పాండు అతని అడ్రస్ గుర్తుపెట్టుకుని వెళ్ళాడు మర్నాడు.

అతను యెన్నెన్నో విషయాలు గటగటా మంచినీళ్ళు త్రాగుతున్నంత సులభంగా చెప్పాడు.

పాండు నిరుద్యోగి అని తెలిసి జాలిగా చూసి నవ్వాడు.

అమెరికాలో రోడ్లు వూడ్చేవాళ్ళకి నెలకి పదివేలు జీతం ఇస్తారని, వాళ్ళు కార్లలో వచ్చి పని చేస్తారనీ విని నివ్వెరపోయాడు పాండు.

"నువ్వు అమెరికా వెళ్తావా? ఏదోక వుద్యోగం దొరుకుతుంది. నిన్ను పంపించే బాధ్యత నాది" అన్నాడు.

ముందు వెనుకా ఆలోచించకుండా తల వూపాడు పాండు!

"అయితే ఎనిమిదివేలు సంపాదించు వెంటనే!" అన్నాడు.

"ఎందుకు?" అన్నాడు ఆశ్చర్యపోయి.

"ప్లేన్ చార్జెస్. అదీగాక వీసా సంపాదించాలి. షిప్‌లో వెళ్తే ఆర్నెల్లు పడుతుంది. అదీకాక షిప్ సరిగా వెళ్తుందో లేదో మధ్యలో ఏ తుఫానుకో మునుగుతుందో తెలియదు" అన్నాడు.

పాండు యెంతో సంతోషంతో తన వూరు తిరిగి వచ్చాడు.

కాని అతను దేశం వదిలి వెళ్ళడానికి ఇంట్లో వాళ్ళు ఒప్పుకోలేదు.

పాండువల్ల అంతా విన్న సూర్యం అమెరికా వెళ్ళడానికి వుబలాట పడ్డాడు. సూర్యం దాదాపు ఏడెనిమిది యేళ్ళుగా రకరకాల ఇంటర్వ్యూలకు వెళ్ళి ఉద్యోగం దొరక్క నిరాశతో వున్నాడు. అందుకే అతను ఎక్కడికైనా వెళ్ళిపోవడానికి సిద్ధపడ్డాడు.

ఇంట్లో అక్కా, బావలతో పోట్లాడి డబ్బు సంపాదించాడు సూర్యం.

బాలుకి టెలిగ్రాం ఇచ్చి పిలిపించాడు పాండు. బాలుకి సూర్యాన్ని పరిచయం చేశాడు. ముగ్గురూ హైదరాబాద్ బయల్దేరారు.

మధ్యలో బస్సు చెడిపోయింది.

దగ్గర్లో యేదైనా వూళ్ళో గడిపి మర్నాడు వెళ్దామన్నాడు బాలు. అప్పటికే బాగా చీకటి పడింది. బస్సు బాగుపడే దారిలేదు. అందుకని ముగ్గురూ కలిసి చేలకి అడ్డంగా నడిచి గుబురుగావున్న ఒక చెట్టుక్రింద ఆగారు.

సమీపంలో ఒక పూరిల్లు వుంది. ఊరికి చాలా దూరంలో వుంది ఆ యిల్లు.

ఆ ఇంట్లో నడివయస్సు ఆమె వుంది. ఆమెకు నలభై దాటివుంటాయి. లావుగా బలంగా వుంది.

బస్సు చెడిపోయిందనీ, తెల్లారేవరకూ హైదరాబాద్ వెళ్ళే మార్గంలేదనీ తమకి అన్నంపెడితే డబ్బు ఇస్తామని బాలు ఆమెను బ్రతిమాలాడు.

ఆమె వాళ్ళ మాటలు విని జాలిపడింది. ఒక గంటలో వంటచేసి పెడతాననీ తన భర్త పనిమీద పొరుగూరు వెళ్ళాడనీ, వాళ్ళు పడుకోవడానికి ఒక చావడి చూపించింది.

మూలనున్న గోతాలకట్ట విప్పియిచ్చింది. అవి పరుచుకుని లాంతరు పెట్టుకుని కూర్చున్నారు.

బాలు విస్కీ బాటిల్ తీశాడు. బ్యాగ్ లోవున్న పకోడీ పొట్లం విప్పాడు. సగంపైగా బాలు త్రాగాడు. పాండు, సూర్యం కొద్దికొద్దిగా పుచ్చుకున్నారు.

గంట తర్వాత ఆమె భోజనం పెట్టింది. తిని వచ్చాక పడుకున్నారు.

ఒక రాత్రివేళ ఆమె కేకలు విని మేలుకున్నారు పాండు, సూర్యం.

ప్రక్కన బాలు లేడు. పరుగున వెళ్ళిచూస్తే ఏముంది బాలు ఆమెను బలవంతం చేస్తున్నాడు.

సూర్యం బాలుని లాగివేశాడు. అన్నంపెట్టిన స్త్రీని బలాత్కారం చేస్తున్నందుకు బాలుని బాగా తిట్టాడు. బాలుకి కోపంవచ్చి సూర్యాన్ని డొక్కల్లో పొడిచాడు. సూర్యం యెదురుతిరిగి గూబమీద కొట్టాడు బాలుని.

ఇద్దరు బాగా కొట్టుకున్నారు. పాండు అడ్డం వెళ్ళినా లాభం లేకపోయింది. ఆ తన్నుకోవడంలో యేమైందో, బాహుశా సూర్యం కణతలకి దెబ్బ తగిలిందేమోగాని కదల కుండా పడిపోయాడు.

సూర్యం చనిపోయాడని తెలిసినా బాలు కొంచెం గూడా భయపడలేదు. ఈ సంగతి యెవరికైనా చెప్తే తను జైలునుంచి వచ్చిన తర్వాతైనా ఆమెను చంపు తానని బెదిరించాడు. ఆమె యెవ్వరికీ చెప్పనని చెప్పింది.

పాండు విపరీతంగా వణికిపోయాడు.

తర్వాత బాలు, పాండు, సూర్యం శవాన్ని దాదాపు మైలుదూరం మోసుకుపోయారు. పొలాలు లేనిచోటు చూసి గొయ్యి తీశారు. సూర్యం తలని మొండెం నుంచి వేరు చేశాడు బాలు కత్తి తీసుకుని. ఆ తలని మరోక ఫర్లాంగు దూరంలో పాతిపెట్టారు.

సూర్యం జేబులోవున్న ఏడువేలలో రెండువేలు పాండుకి ఇచ్చి యీ విషయం ఎక్కడైనా పొక్కితే తనకీ అదే గతి పడ్తుందని హెచ్చరించాడు బాలు.

మర్నాడు హైదరాబాద్ వెళ్ళిపోయారు. తను అమెరికా చేరుకున్నట్లు తర్వాత లెటర్ రాసి ఆమె అక్కకు వేశాడు బాలు.

అదీ కథ.

అంతా విని దీర్ఘంగా నిట్టూర్చాడు సురేంద్ర.

మర్నాడు హైదరాబాదులో బాలుని అరెస్టుచేశారు.

—: అయిపోయింది :—